సాక్షి ఒడిశా

శుక్రవారం | 8 | నవంబర్ | 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6,78,689లు, బంగారం 1.600 గ్రాములు వెండి 137 గ్రాముల 400 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



మావోల బెడద తగ్గిస్తాం

మల్కన్‌గిరి జిల్లాలో డీఐజీ పర్యటించారు. స్థానిక జవాన్లతో మాట్లాడారు.

- 8లో



వలకు చిక్కిన చిరుత

ఢెంకనాల్ అటవీ ప్రాంతంలో ఓ చిరుత పులి వలకు చిక్కింది. దీన్ని నందన్‌కానన్‌కు తరలించారు.

- 8లో

న్యూస్‌రీల్

మిల్లుకు చేరిన రేషన్ బియ్యం



రైస్ మిల్లుకు చేరిన రేషన్ బియ్యం బస్తాలు

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి హడిగుడ పంచాయతీకి వచ్చిన రేషన్ బియ్యంలో పురుగులు ఉండటంతో వాటిని తీసుకునేందుకు లబ్ధిదారులు నిరాకరించిన సంగతి తెలిసిందే. విషయం తెలుసుకున్న అధికారులు ఆ బియ్యాన్ని స్థానిక రైసు మిల్లుకు తరలించారు. మిల్లులో వాటిని శుభ్రపరిచి తిరిగి ఆ బియ్యాన్నే పంపిణీ చేసేందుకు అధికారులు సన్నహాలు చేస్తున్నట్లు తెలిసింది.

భారీగా కలప పట్టివేత



మత్తిలి అటవీ శాఖ వారు స్వాధీనం చేసుకున్న కలప

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా మత్తిలి సమితి కెందుగూడ గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన కలపను అటవీ శాఖాధికారులు గురువారం పట్టుకున్నారు. ముందుగా వచ్చిన సమాచారం ప్రకారం మత్తిలి అటవీ శాఖ సిబ్బంది ఓ ఇంటిపై దాడి చేయగా అక్కడ చిన్నసైజ్ కలప 37, పెద్ద సైజు కలప 52 బల్లలు దొరికాయి. వీటిని స్వాధీనం చేసుకున్నారు. దాడి గురించి తెలుసుకున్న ఆ ఇంటి వారు ముందుగానే పరారయ్యారు.

అమ్మ ఆవేదన



ఈ పసికందు వయసు రెండు నెలలు. ఊయలలో నిశ్చింతగా బజ్జునే భాగ్యం ఈ పసిపాపకు లేదు. తల్లి భుజం దాటి నిద్రపుచ్చడానికి వీలు కాదు. ఈ బుజ్జాయి వీపుపై ఓ కణితి ఏర్పడింది. రోజురోజుకూ అది పెరుగుతోంది. ఈ కణితి వల్ల చిన్నారి పడుకోవడానికి కూడా వీలు కావడం లేదు. జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ సమితి బలియ పంచాయతీ కొరసాలిగుడ గ్రామానికి చెందిన ఆదియ, గౌరీ దంపతుల బిడ్డకు పుట్టిన నాటి నుంచే ఈ సమస్య ఉంది. పాపను ఆస్పత్రికి తీసుకెళ్లి చూపిస్తే ఆపరేషన్ చేయాలని చెప్పారు. ఆపరేషన్ చేయించడానికి వారి ఆర్థిక స్థోమత సరిపోక మిన్నకుండిపోయారు. కానీ బిడ్డ పరిస్థితి చూసి తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు. కాసేపు మంచంపై వేసినా బిడ్డ నొప్పితో అల్లాడిపోతోందని చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి తమకు సాయం చేస్తే బిడ్డ సాధారణ పరిస్థితికి వస్తుందని వారు కోరుతున్నారు.

- జయపురం

మరో మూడేళ్లలో.. భువనేశ్వర్ మెట్రోరైల్ ప్రాజెక్టు



- రూ. 6,255 కోట్ల అంచనా వ్యయం
- 26 కిలోమీటర్ల దూరంలో 20 స్టేషన్లు
- ప్రతి 10 నిమిషాలకో రైలు



ఆచార్య విహార్ నుంచి కిట్ స్క్వేర్ మధ్య రహదారి విస్తరణకు ఏర్పాటు చేసిన బారికేడ్లు

భువనేశ్వర్:

రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌కు మరో మూడేళ్లలో మెట్రో రైలు రవాణా సౌకర్యం అందుబాటులోకి రానుంది. 2027 డిసెంబరు నెలాఖరు నాటికి ఈ ప్రాజెక్టు పనులు పూర్తి చేసేందుకు యోచిస్తున్నారు. తొలి దశలో 3 బోగీలతో మెట్రో రైలు సేవల్ని ప్రవేశ పెడతారని అధికారిక వర్గాల సమాచారం. సాధారణ రహదారి నుంచి 13 మీటర్ల ఎత్తున మెట్రో రైలు పరుగులు తీయనుంది. స్థానిక రాజమహల్, జయదేవ్ విహార్, బారంగ్ ప్రాంతాల్లో ఈ ఎత్తు మరింత అధికంగా ఉండే అవకాశముంది. ప్రతి 10 నిమిషాలకో మెట్రో రైలు సేవలు అందుబాటులో ఉంటాయి. ఈ సేవల్ని అందించేందుకు 3 బోగీలతో కూడిన 13 మెట్రో రైళ్లు నిత్యం రాకపోకలు సాగిస్తాయి.

మట్టి పరీక్షల తర్వాత శంకుస్థాపన..

మెట్రో రైలు ప్రాజెక్టు నిర్మాణం ప్రాథమిక దశ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ప్రతిపాదిత మెట్రో రైలు మార్గం నిర్మాణం ప్రాంతంలో మట్టిని పరీక్షిస్తున్నారు. పలు ప్రాంతాల్లో 50 నుంచి 60 అడుగుల లోతున తవ్వి మట్టి సేకరించి పరీక్షలకు పంపిస్తున్నారు. ఢిల్లీ, కటక్ ప్రాంతాల్లో ప్రయోగశాలలో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. మరో రెండు నెలల్లో ఈ ప్రక్రియ పూర్తవుతుంది. మట్టి పరీక్ష దశ పూర్తి కావడంతో శంకుస్థాపనకు సన్నాహాలు చేస్తున్నారు.

పాదచారులకు ప్రత్యేక బాట..

మెట్రో రైలు మార్గం నిర్మాణం నేపథ్యంలో పాదచారుల కోసం ప్రత్యేక బాట నిర్మించనున్నారు. స్థానిక శిశుభవన్ కూడలి నుంచి రఘునాథ పూర్ ప్రాంతం వరకు రహదారి విస్తరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రెండు నెలల్లో రహదారి విస్తరణ పనుల పూర్తి చేసేందుకు కాల పరిమితిగా నిర్ణయించారు.

కాస్టింగ్ యార్డు ఏర్పాటు..

భువనేశ్వర్ మెట్రో రైలు ప్రాజెక్టు పనులు చురుగ్గా కొనసాగించేందుకు స్థానిక ఘటికియా ప్రాంతంలో కాస్టింగ్ యార్డు నిర్మాణం చేపట్టారు. ప్రాజెక్టుకు అవసరమైన కార్యకలాపాలు ఈ ప్రాంగణంలోనే కొనసాగిస్తారు.

నిర్వహణ డిపో..

మెట్రో రైలు ప్రాజెక్టు కార్యకలాపాల కోసం త్రిశూలియా ప్రాంతం ఫులాపొఖోరి రొత్తాగొడా సమీపంలో నిర్వహణ డిపో పనులు ప్రారంభించారు. ఈ ఏడాది జనవరి1న మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ దీర్ఘకాలిక కోరిక మెట్రో రైలు ప్రాజెక్టు నిర్మాణం కోసం తొలి భూమి పూజలు నిర్వహించి ప్రాజెక్టు పనులకు అంకురార్పణ చేసిన సంగతి తెలిసిందే.

రెండంచెల్లో పనులు..

కటక్, భువనేశ్వర్ జంట నగరాల అనుసంధానంతో రాష్ట్రంలో తొలి మెట్రో రైలు ప్రాజెక్టు ప్రారంభమైంది. తొలి దశలో స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి త్రిశూలియా వరకు మెట్రో రైలు మార్గం పూర్తి చేస్తారు. మలి దశలో కటక్ నేతాజీ బస్సు టెర్మినల్ వరకు ఈ ప్రాజెక్టుని విస్తరిస్తారు. తదుపరి రోజుల్లో ఖుర్దా, పూరీ ప్రాంతాలకు పొడిగిస్తారని భూమి పూజ పురస్కరించుకుని అప్పటి ముఖ్యమంత్రి ప్రకటించారు. భువనేశ్వర్ మెట్రో రైలు ప్రాజెక్టు వ్యయ అంచనా సుమారు 6,255 కోట్ల రూపాయలు. బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం, క్యాపిటల్ ఆస్పత్రి, రాజమహల్, వాణీ విహార్, ఆచార్య విహార్, పటియా ప్రాంతాల గుండా 20 హాల్టులతో స్టేషన్లు నిర్మిస్తారు. ఈ లెక్కన 26 కిలోమీటర్ల దూరంలో 20 స్టేషన్లలో మెట్రో రైలు ఆగుతుంది.

ప్రజల వద్దకే న్యాయం



కొత్త చట్టాలపై అవగాహన కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాల్గొన్న న్యాయ శాఖ మంత్రి పృథ్వీ రాజ్ హరిచందన్ ఇతర ప్రముఖులు.



మాట్లాడుతున్న ముఖ్యమంత్రి మోహన్



కొత్త చట్టాల అవగాహన కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు

భువనేశ్వర్: అన్ని వర్గాల ప్రజలకు సముచిత న్యాయం అందజేయడం ప్రభుత్వ లక్ష్యమని, ఈ నేపథ్యంలో ప్రజల వద్దకే న్యాయం చేరదీయడం ప్రభుత్వ కార్యాచరణగా పలు సంస్కరణలు చేపడుతున్నామని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి తెలిపారు. స్థానిక లోక్ సేవా భవన్‌లో గురువారం నిర్వహించిన భారతీయ నాగరిక సురక్షా సంహిత, భారతీయ న్యాయ సంహిత చైతన్య కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన ప్రసంగించారు. వర్ధమాన సమాజంలో పౌర రక్షణ, న్యాయ సంహిత అత్యంత కీలకమని, జాతీయ స్థాయిలో న్యాయ వ్యవస్థని మరింత సరళీకరించి స్వచ్ఛ, నిష్పక్షపాత న్యాయం కల్పించే దిశలో భారత ప్రభుత్వం పలు సంస్కరణలు చేపడుతుందన్నారు. ఇటీవల కాలంలో భారత ప్రభుత్వం 3 కొత్త చట్టాల్ని ప్రవేశ పెట్టింది. వీటిలో భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్షా సంహిత, భారతీయ సాక్ష్య చట్టం ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ చర్యతో దీర్ఘకాలంగా 164 ఏళ్ల నిరవధికంగా కొనసాగిన సామ్రాజ్యవాద శైలికి తెర పడిందన్నారు. భారత ప్రభుత్వం గడచిన దశాబ్దంలో సుమారు 1,550 పైబడి అప్రసంగిక చట్టాల్ని రద్దు చేసిందని, దీని వల్ల మహిళలు, శిశువులు ప్రధానంగా న్యాయ సంరక్షణ పొందగలుగుతారని ముఖ్యమంత్రి ప్రసంగంలో పేర్కొన్నారు. భారతీయ న్యాయ సంహితలో సైబర్ నేరాల కట్టడికి పెద్ద పీట వేయడం విశేషమని పేర్కొన్నారు. సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్టు వంటి సరికొత్త చట్టాలపై సామాన్య పౌరులకు పరిపూర్ణ అవగాహన అవసరమని, ఈ చట్టాల కింద నేరస్తులకు కఠిన శిక్షలు అమలు చేసేందుకు వీలు కల్పించారని తెలిపారు.

ప్రతి మండలంలో న్యాయ స్థానం..

గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో పౌరులకు సత్వర న్యాయం కల్పించేందుకు ప్రభుత్వం సంకల్ప బద్ధంగా పనిచేస్తోంది. ఈ దిశలో ప్రతి మండలంలో ఒక్కో న్యాయ స్థానం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. సకాలంలో న్యాయం మంజూరు చేయడంతో దోషులకు చట్టపరమైన శిక్షల అమలు వేగం పుంజుకుంటుందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళలు, శిశువులు వంటి సున్నితమైన సామాజిక వర్గాలకు రక్షణ లభిస్తుందన్నారు. న్యాయ వ్యవస్థలో భారీ సంస్కరణలు చేపట్టి నేర రహిత ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణం ధ్యేయంతో ప్రభుత్వ పాలన ప్రజలకు అందజేస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు.

విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయడమే లక్ష్యం



వేదికపై ఉన్న కలెక్టర్ పట్వారీ తదితరులు

- కలెక్టర్ ఫరూల్ పట్వారీ



కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

రాయగడ: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను బయటకు తీసి, ఆయా రంగాల్లో వారిని ప్రోత్సహించడమే సురభి లక్ష్యమని కలెక్టర్ ఫరూల్ పట్వారీ అన్నారు. స్థానిక బిజూ పట్నాయక్ ఆడిటోరియంలో జిల్లా శిశు మహోత్సవం సురభి–24 కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థికి ఆసక్తి ఉండే రంగంవైపు వారిని ప్రోత్సహిస్తే ఎదిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. సురభి పేరిట జిల్లా యంత్రాంగం ప్రతీ ఏడాది ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ, వారిని ప్రోత్సహిస్తుండడం సంతోషకరమని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించాలని సూచించారు. జిల్లా విద్యాశాఖ అధికారి బసంత కుమార్ నాయక్ మాట్లాడుతూ.. సమితి స్థాయిలో నిర్వహించిన సురభి కార్యక్రమంలో భాగంగా వివిధ అంశాల్లో విద్యార్థుల మధ్య పోటీలను నిర్వహించడం జరిగిందన్నారు. గెలిపొందిన విద్యార్థులకు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం కలిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఈవో భజన్ లాల్ మాఝి తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపల్ సెక్రటరీ శుభశర్మ పర్యటన



కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ శుభ శర్మ



దోంబాలో మహిళలతో మాట్లాడుతున్న దృశ్యం

పర్లాకిమిడి: రాష్ట్ర మహిళ, శిశు వికాస్ విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీ శుభ శర్మ గజపతి జిల్లాలో గురువారం పర్యటించారు. మోహనా నియోజకవర్గం లుహాగుడిలో ఆదివాసీ ఉన్నత పాఠశాలలు సందర్శించి అక్కడ ఉపాధ్యాయులు, విద్యార్థులతో సంభాషించారు. ప్రభుత్వం అందిస్తున్న సుభద్ర యోజన, దివ్యాంగుల భృతి, మిషన్ శక్తి పథకాల అమలులో నిరాసక్తత కనిపిస్తోందని మహిళా సంక్షేమ శాఖ అధికారి మనోరమా దేవిని మందలించారు. అనంతరం మోహనాలో మిషన్ శక్తి ద్వారా ఉపాధి పొందుతున్న మహిళా బ్యూటీ పార్లర్లు, కుట్టు మిషన్ కేంద్రాలు, సుభద్ర పథకాలపై స్వయం సహాయక గ్రూపులతో మాట్లాడారు. ఆర్.ఉదయగిరి సమితి దుంబాలో గ్రామీణ పార్కు, మిషన్ శక్తి కేఫ్, సామాజిక ఆరోగ్య కేంద్రంను పరిశీలించారు. అలాగే రాయఘడ బ్లాక్‌లో ఎస్ఎస్‌డీ ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలకు వెళ్లి మధ్యాహ్న భోజన పథకం అందుతున్నదీ లేనిదీ అక్కడ విద్యార్థులతో సంభాషించారు. అనంతరం గజపతి జిల్లాలో విద్య, ఆరోగ్యం, రోడ్లు, బాల వికాస్ పథకాలు, సుభద్ర యోజన, తాగునీరు, స్వచ్ఛ భారత్, గ్రామాల విద్యుద్దీకరణ, నదులు, చెరువుల నిర్మాణం, సామాజిక సురక్ష, వికలాంగులకు స్వశక్తీకరణ ఉపకరణములు, పింఛన్లపై గజపతి కలెక్టరేట్‌లో వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్షించారు. సమావేశంలో కలెక్టర్ బిజయకుమార్ దాస్‌తో పాటు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ సీడీఎం గుణనిధి నాయక్, అదనపు జిల్లా కార్య నిర్వహణ అధికారి పృథ్వీరాజ్ మండల్, సబ్ కలెక్టర్ అనుప్ పండా, జిల్లా ముఖ్యవైద్యాధికారి డా.మహ్మద్ అలీ, సమగ్ర గిరిజనాభివృద్ధి శాఖ పీవో అంశుమాన్ మహాపాత్రో తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కాళీ పూజలు



మహిళల దీపారాధన

రాయగడ: స్థానిక బ్లాక్ కాలనీ సమీపంలో కాళీ పూజలు వైభవంగా కొనసాగుతున్నాయి. అమ్మవారిని దర్శించుకునేందుకు వేల సంఖ్యలో భక్తులు వస్తున్నారు. దీపావళి నుంచి ప్రారంభమైన కాళీ పూజలు ఈనెల 12వ తేదీతో ముగుస్తాయి. అమ్మవారికి సాంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలను చేపడుతున్నారు. ఇక్కడ గత 41 ఏళ్లుగా శికుమార్ పట్నాయక్ ఆధ్వర్యంలో ఈ పూజలు జరుగుతుండడం విశేషం. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్ భక్తులను ఆకట్టుకుంటున్నాయి.

కళ.. భళా



వారణాసి ఉన్నత పాఠశాల విద్యార్థుల గోటిపువా నృత్యం

పర్లాకిమిడి:

ఒడిశాలో మన కళ, సంస్కృతిని పరిరక్షిస్తూ విద్యార్థులు సురభి మహోత్సవంలో తమ ప్రతిభను ప్రదర్శించి రాష్ట్ర స్థాయిలో ఉత్తమ బహుమతులు సాధించాలని జెడ్పీ చైర్మన్ గవర తిరుపతి రావు అన్నారు. స్థానిక మహారాజా బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం జిల్లా స్థాయి శిశు మహోత్సవం 'సురభి' 2024ను ఆయన ముఖ్య అతిథిగా ప్రారంభించారు. మరో గౌరవ అతిథి పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠి, జిల్లా ముఖ్య శిక్షాధికారి డాక్టర్ మాయాధర్ సాహు, హైస్కూల్ ప్రధాన ఉపాధ్యాయురాలు మోనాలిసా దాస్ జ్యోతిని వెలిగించి క్విజ్, చిత్రలేఖనం, వక్తృత్వ, ప్రబంధాలు, లోక కళా నృత్య పోటీలను ప్రారంభించారు. గజపతి జిల్లాలో ఏడు సమితి కేంద్రాల నుంచి 50 వరకూ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పలు పోటీల్లో పాల్గొన్నారు. ఈ లోక్ కళా నృత్యాల పోటీల్లో మోహానా ఉన్నత పాఠశాల, గుమ్మా సమితి గైబ పాఠశాల, కాశీనగర్ వారణాసి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి. విజేతలకు ప్రశంసాపత్రాలు, మెమెంటోలు డీఈఓ మాయాధర్ సాహు అందజేశారు. కార్యక్రమం వాఖ్యాతగా ఉపాధ్యాయులు అనాది పాణిగ్రాహి, రఘునాథ పట్నాయిక్‌లు వ్యవహరించారు.



ఆదివాసీ కళానృత్యంలో విద్యార్థులు



ఆదివాసీ నృత్యంలో గైబ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు



జిల్లా స్థాయి శిశు మహోత్సవానికి విచ్చేసిన వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, అధికారులు

ఆహార భద్రతలో ప్రభుత్వం విఫలం

- సర్కారుపై విమర్శలు ఎక్కు పెట్టిన నవీన్ పట్నాయక్



బీజేడీ సభ్యత్వ నమోదు చైతన్య కార్యక్రమంలో నవీన్ పట్నాయక్ ప్రసంగం

భువనేశ్వర్: రాష్ట్రంలో పాలన పగ్గాలు చేపట్టిన భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం పేదలకు ఆహార భద్రత కల్పించడంలో ఘోరంగా విఫలమైందని, బిజూ జనతా దళ్ సుదీర్ఘ 12 ఏళ్ల నిరంతర కృషి ఫలితాల్ని నిలువునా నీరు గార్చిందని విపక్ష బిజూ జనతా దళ్ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. బీజేడీ సభ్యత్వ నమోదు చైతన్య కార్యక్రమాన్ని పురస్కరించుకుని స్థానిక శంఖ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన గురువారం ప్రసంగించారు. పేదలకు ఆహార భద్రత కల్పించడంలో రాజీ పడడం తగదని ఆయన హితవు పలికారు. తమ హయాంలో జాతీయ ఆహార భద్రత నుంచి మినహాయింపు పొందిన బీద వర్గాలకు రాష్ట్ర ఆహార భద్రత కింద నిరవధికంగా లబ్ధి కల్పించినట్లు గుర్తు చేశారు. ఆహార భద్రత కింద తిండి గింజలు లభించక కంధమల్ జిల్లాలో ఇద్దరు మహిళలు ప్రాణాలు కోల్పోగా మరో ఇద్దరు విషమ పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రజలకు ఆహార భద్రత కల్పించడంలో వైఫల్యానికి ఇది నిలువెత్తు తార్కాణమని నవీన్ పట్నాయక్ వ్యాఖ్యానించారు. ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా ప్రస్తుత ప్రభుత్వం గత ప్రభుత్వం తరహాలో బీదలందరికీ ఆహార భద్రత కల్పించడం అనివార్యంగా పరిగణించాలని అభ్యర్థించారు.

యువతే భవిత

ఉజ్వల సమాజం ఆవిష్కరణలో వర్ధమాన యువత ముందంజలో ఉండాలని ఆయన సూచించారు. యువత, విద్యార్థి వర్గం కోసం తమ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పలు ప్రయోజనకర పథకాలు, కార్యక్రమాల్ని వర్ధమాన ప్రభుత్వం రద్దు చేయడంపై విచారం వ్యక్తం చేశారు. ప్రజల ఆశయాలు నెరవేర్చే కార్యాచరణతో సుదీర్ఘ పాలన కొనసాగించిన బిజూ జనతా దళ్ కార్య శైలిని సమాజంలో అన్ని వర్గాల ప్రజలకు తెలియజేసే దిశలో యువతరం చైతన్యవంతం కావాలని పిలుపునిచ్చారు. ప్రజల పార్టీగా బీజేడీని కొనసాగించేందుకు సభ్యత్వ నమోదు కార్యాచరణలో యువతరం చురుకైన పాత్ర పోషించాలని కోరారు. విపక్షంగా బీజేడీ ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతుందని నవీన్ పట్నాయక్ ప్రకటించారు.

క్లుప్తంగా

విమానాశ్రయంలో ప్రయాణికుల ఆందోళన

భువనేశ్వర్: హైదరాబాద్‌కు బయల్దేరాల్సిన విమాన సేవలు వరుసగా రద్దు చేయడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరంతా స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయంలో నిరసన ప్రదర్శించారు. భువనేశ్వర్ నుంచి హైదరాబాద్‌కు బుధవారం ఉదయం 9.55 గంటలకు బయల్దేరాల్సిన విమానం ఆలస్యంగా గురువారం ఉదయం 8.45 గంటలకు బయల్దేరుతుందని ప్రకటించారు. ఈ ప్రకటన ప్రకారం గురువారం విమానాశ్రయానికి చేరిన ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యం ఎదురైంది. గురువారం ఈ విమాన సేవలు రద్దు చేసినట్లు విమానాశ్రయం అధికార వర్గాలు ప్రకటించాయి. తరచు సేవల్ని రద్దు చేస్తూ ప్రయాణికుల్ని వేధిస్తున్నారని ఆందోళనకు దిగారు. విమాన వేళల మార్పునకు అనుగుణంగా అనుసంధాన విమానయాన సౌకర్యాలు కల్పించినట్లు బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం డైరెక్టరు ప్రసన్న ప్రధాన్ తెలిపారు.

యోగా క్రీడాకారుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో నిర్వాహకులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం యోగా హాలులో గురువారం అంతర విశ్వవిద్యాలయాల పోటీల్లో పాల్గొనే యోగా క్రీడాకారుల ఎంపిక నిర్వహించారు. 30 మంది క్రీడాకారులు హాజరు కాగా యు.కృపారాణి, డి.రూపప్రియాంక, కె.సాయిసుధ, సీహెచ్ శిరీష, ఎస్.గణేష్, బి.రవీంద్ర, బి.శివసాయి, డి.స్వర్ణరాజ్, ఎస్.భాస్కర్‌రావులను ఎంపిక చేశారు. వీరికి డిసెంబర్ 26 వరకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి జాతీయ స్థాయి విశ్వవిద్యాలయాల పోటీలకు పంపిస్తారు. కార్యక్రమంలో ట్రిపుల్ ఐటీ యోగా శిక్షకులు ఈశ్వర్, స్పోర్ట్సు డీన్ రవికుమార్, అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లు శ్రీనివాస్, భాస్కర్ పాల్గొన్నారు.

అర్ధరాత్రి దొంగల హల్‌చల్


సీసీ కెమెరాకు చిక్కిన దుండగులు

రణస్థలం: మండలంలోని కోష్ట జంక్షన్‌లో బుధవారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ సృష్టించారు. ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ముసుగులు ధరించి రోడ్డుపై అటూ ఇటూ సంచరిస్తూ పలు షాపుల్లోకి ప్రవేశించేందుకు విఫలయత్నం చేశారు. ఓ షాపులోకి ప్రవేశిస్తుండగా వాహనాల అలజడితో పరారయ్యారు. ఈ దృశ్యాలన్నీ ఓ వస్త్ర దుకాణదారుడి సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. రాత్రివేళల్లో దొంగల బెడద ఎక్కువగా ఉన్నందున పోలీసులు నిఘా పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పశువుల వ్యాన్ పట్టివేత

రణస్థలం: పశువులను అక్రమంగా కబేళాలకు తరలిస్తున్న బొలెరో వాహనాన్ని జె.ఆర్.పురం మండల కేంద్రం వద్ద పోలీసులు పట్టుకున్నారు. నరసన్నపేట మండలం కిలారి గ్రామం నుంచి విశాఖపట్నం వీటిని అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. పశువులను స్వాధీనం చేసుకుని కొత్తవలస గోశాలకు తరలించి వ్యాన్ సీజ్ చేశామని ఎస్సై ఎస్.చిరంజీవి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

ఎల్‌ఎల్‌బీ కోర్సులో 39 మందికి ప్రవేశాలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలోని మూడేళ్ల ఎల్‌ఎల్‌బీ కోర్సులో చేరేందుకు గురువారం 39 మంది విద్యార్థులు రిపోర్టు చేశారు. ప్రవేశాలకు శుక్రవారం సాయంత్రం వరకు గడువు ఉంది. మొత్తం 66 సీట్లు ఉండగా 65 మంది ఆప్షన్లు ఇచ్చుకున్నారు. త్వరలోనే క్లాస్‌వర్కు ప్రారంభించనున్నట్లు కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ వై.రాజేంద్రప్రసాద్ తెలిపారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం



అవగాహన కల్పిస్తున్న డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: బాల కార్మికులకు విముక్తి కల్పించి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుదామని జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. గురువారం జిల్లా పరిషత్ రోడ్డులో పలు షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలని షాపు యజమానులకు సూచించారు. కార్యక్రమంలో కార్మిక అధికారి శ్రీనివాసరావు, జి.ఇందిరా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దోమతెరల పంపిణీ


చైతన్య రథాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నర్సింగ్ మడ్కమి

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి సమితి గౌడిగూడ పంచాయతీలో గురువారం దోమతెరలను పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా మల్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సింగ్ మడ్కమి హాజరయ్యారు. దోమతెర వడకంపై ప్రజల్లో అవగహన కాల్పించారు. చైతన్య రథాన్ని ప్రారంభించారు. జిల్లా వైద్యధికారి బ్రజాబందు దాస్ మాట్లాడుతూ.. జిల్లాలో గిరిజన ప్రాంత ప్రజాలు దోమతెరలు వినియోగంచాలని సూచించారు. ఈ చైతన్య రథం ప్రతీ గ్రామం తిరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరికీ దోమతెరలు అందజేసే భద్యతను అంగాన్‌వాడీ, ఆశ కార్మికులకు అప్పగించారు. ఈ కర్యక్రమంలో జిల్లా అదనపు వైద్యాధికారి కవిత స్వయి, మల్కన్‌గిరి సమితి వైస్ చైర్మన్ నిరంజన్, జిల్లా అడిషినల్ గ్రూప్ డెవలప్‌మెంట్ అధికారి కాసం తిర్కీ, పంద్రీపాణి ఆరోగ్య కేంద్ర వైద్యుడు నిషంత్ దాస్, ప్రజలు పాల్గొన్నారు.

పర్లాకిమిడి: జిల్లాలోని గుసాని సమితి స్టీరింగ్ కమిటీ సమావేశం బ్లాక్ హాల్‌లో గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి విచ్చేశారు. గుసాని సమితి అధ్యక్షుడు ఎన్.వీర్రాజు, జెడ్పీటీసీ జోన్–1 ఎస్.బాలరాజు, బీడీఓ. గౌర చంద్ర పట్నాయక్ హాజరయ్యారు. మలేరియా బారిన ప్రజలు పడకుండా శీతాకాలంలో దోమతెరలు పంపిణీ చేయాలని గుసాని సమితి అధ్యక్షుడు వీర్రాజు కోరారు. గుసాని సమితిలో పలు పంచాయతీలలో శానిటరీ, తాగునీటి సమస్యలపై స్టీరింగ్ కమిటీలో సభ్యులు చర్చించారు. ఈ సమావేశానికి గురండి సామాజిక ఆరోగ్య కేంద్రం సంప్రసారణ అధికారి మమాతా పాడీ అధ్యక్షత వహించారు.


మహిళలకు దోమ తెరలను అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు


కార్యక్రమానికి హాజరైన ప్రజలు


మాట్లాడుతున్న బీడీఓ గౌర చంద్ర పట్నాయక్

క్యాన్సర్‌పై అవగాహన



అవగాహన ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు


క్యాన్సర్‌పై నాటకం ప్రదర్శిస్తున్న విద్యార్థులు

రాయగడ: జాతీయ క్యాన్సర్ చైతన్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రెగడ గ్రామంలో గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ యూనివర్సిటీ నర్సింగ్ విభాగానికి చెందిన విద్యార్థులు గురువారం చైతన్య, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. క్యాన్సర్ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. క్యాన్సర్ వ్యాప్తికి గల కారణాలను నాటక రూపంలో గ్రామస్తులకు చైతన్యపరిచారు. జగన్నాథపూర్ ప్రథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ అధికారి కాళీప్రసాద్ పండా క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు.

వలకు చిక్కిన చిరుత


వలలో చిక్కిన చిరుత

భువనేశ్వర్: వలలో చిక్కిన చిరుత పులిని సురక్షితంగా నగరం శివారులోని నందన కానన్ జంతు ప్రదర్శన శాలకు తరలించారు. ఢెంకనాల్ అటవీ ప్రాంతం మహాబిరోడ్ రేంజ్ దొదొరాఘాటి సెక్షన్ ఒసానొబహాలి ప్రాంతంలో వన్య ప్రాణుల వేట కోసం పన్నిన వలలో చిరుత పులి గురువారం చిక్కుకుంది. విషయం తెలియడంతో అటవీ శాఖ అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణలో వన్య ప్రాణుల వైద్య బృందం ఘటనా స్థలానికి చేరింది. చిరుత పులిపై మత్తు ప్రయోగించి అదుపులోకి తీసుకున్నారు. మత్తులో ఉండగా గాయాలకు చికిత్స చేసి నందన కానన్‌కు తరలించారు. ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్ ఆర్‌ఆర్‌టీ ఆధ్వర్యంలో చిరుతని సురక్షితంగా గమ్యం చేర్చారు.


చిరుతకు చికిత్స చేస్తున్న వన్య ప్రాణుల వైద్య బృందం

హాయిగా విశ్రాంతి తీసుకోవచ్చు..


ఎయిర్ కండిషను ఫ్రీ - పెయిడ్ విశ్రాంతి కేంద్రం



ధరల పట్టిక

భువనేశ్వర్: తూర్పు కోస్తా రైల్వే జోనల్ ప్రధాన కార్యాలయం స్టేషన్ భువనేశ్వర్ రైల్వే ప్లాట్‌ఫారమ్‌పై తక్కువ ధరలకు ఎయిర్ కండీషన్ విశ్రాంతి గదులు ప్రవేశపెట్టారు. రాత్రింబవళ్లు ఈ సౌకర్యం అందుబాటులో ఉంటుంది. ఒక గంట పాటు ఉండడానికి ఒక్కరికి రూ.12లు మాత్రమే తీసుకుంటారు. 12 ఏళ్ల లోపు పిల్లలకు ఒక్కొక్కరికి రూ. 6 చెల్లించాల్సి ఉంటుందని ప్రకటించారు.

నకిలీ దగ్గు మందు జప్తు


జప్తు చేసిన నకిలీ దగ్గు మందు

భువనేశ్వర్: కటక్ నగరంలో మందుల కంపెనీపై అర్ధరాత్రి ఆకస్మికంగా చేపట్టిన దాడుల్లో భారీ మొత్తంలో నకిలీ దగ్గు మందు జప్తు చేశారు. డ్రగ్స్ కంట్రోలర్ మరియు అబ్కారీ శాఖ సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ వ్యవహారంలో ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. అబ్కారీ విభాగం పోలీసుల ఆధ్వర్యంలో సుమాండి గ్రామంలో నకిలీ దగ్గు మందు ఉత్పత్తి చేస్తున్న కృష్ణ మెడిసిన్ ఫార్మ్ సంస్థపై బుధవారం అర్ధరాత్రి దాడి చేశారు. నకిలీ మందు ఉత్పాదన, అక్రమ విక్రయం ఆరోపణల కింద నిందితులకు వ్యతిరేకంగా చర్యలు చేపట్టారు. దాడిలో సమగ్రంగా 31 రకాల అక్రమ తయారీ, ఉత్పాదిత మందులను పోలీసులు జప్తు చేశారు. అరెస్టైనవారిలో కృష్ణ మెడిసిన్ ఫార్మ్ సంస్థ యజమాని, శంఖత్రాస్ గ్రామస్తుడు జయరామ్ సాహు, అతని అనుచరుడు ప్రఫుల్ల కుమార్ జెనా ఉన్నారు.

ఘనంగా మహా విప్లవ దినోత్సవం


అక్టోబర్ మహావిప్లవ దినోత్సవంలో కమ్యూనిస్టు శ్రేణులు

జయపురం: కమ్యూనిస్టు పార్టీ కొరాపుట్ జిల్లా శాఖ గురువారం స్థానిక కార్మిక భవనంలో అక్టోబర్ మహావిప్లవ దినోత్సవం నిర్వహించింది. రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ కార్యవర్గ సభ్యులు ప్రమోద్ కుమార్ మహంతి అక్టోబర్ మహా విప్లవం చరిత్ర, దాని ప్రాధాన్యతలను వివరించారు. నేడు కొరాపుట్ జిల్లాలో బయాగుడ, సుండిగుడ, బొయిపరిగుడ సమితి ముదులిగుడ, కొట్‌పాడ్ సమితి చందిలి, దశమంతపూర్ సమితుల్లోనూ దినోత్సవం నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలో పార్టీని బలోపేతం చేసేందుకు పార్టీ శ్రేణులు ప్రతి గ్రామం వెళ్లి నూతన సభ్యులను చేర్పించాలన్నారు. రానున్న రోజుల్లో జిల్లా ప్రజల సమస్యలు ముఖ్యంగా ధరల పెరుగుదల, నిరుద్యోగ సమస్య, జగన్నాథ్ సాగర్, నీలకంఠ సాగర్, సేవాపేపరుమిల్లు తదితర సమస్యలపై ఆందోళన నిర్వహిస్తామన్నారు.

షాపులపై పౌర సరఫరా అధికారుల దాడులు


షాపులలో దాడులు జరుపుతున్న అధికారులు

జయపురం: పౌర సరఫరాలు, కొలతల విభాగాలకు చెందిన అధికారులు జయపురంలోని పలు షాపులపై గురువారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 23 నాన్ కమర్షియల్ సిలిండర్లను సీజ్ చేశారు. ఒక కొలత యంత్రం కూడా సీజ్ చేశారు.

నేడు రైల్వే గేటు మూసివేత

టెక్కలి: టెక్కలి గోపినాథపురం వద్ద శుక్రవారం రైల్వే గేటును మూసివేస్తున్నట్లు పీడబ్ల్యూఐ సీనియర్ సెక్షన్ ఇంజినీర్ వై.చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం సాయంత్రం 6 గంటల నుంచి శనివారం ఉదయం 6 గంటల వరకు గేటు మూసివేసి ట్రాక్ మరమ్మతులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. వాహన చోదకులు, స్థానికులు సహకరించాలని కోరారు.

విద్యుత్ చార్జీల పెంపు ఉపసంహరించుకోవాలి



విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

అరసవల్లి: విద్యుత్ చార్జీల పెంచుతూ కూటమి సర్కార్ తీసుకున్న నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. సర్దుబాటు చార్జీల పేరిట సామాన్యులపై ఆర్థిక భారాన్ని మోపడాన్ని నిరసిస్తూ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు ఆధ్వర్యంలో గురువారం శ్రీకాకుళం విద్యుత్ శాఖ సర్కిల్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజలు, రైతులపై చార్జీల ప్రభావం దారుణంగా పడుతుందన్నారు. అధికారంలోకి వచ్చిన ఐదారు నెలల్లోనే రెండు సార్లు విద్యుత్ చార్జీలను పెంచడం తగదన్నారు. సూపర్‌సిక్స్ పథకాల అమలు చేయలేకే చార్జీల పెంచుతున్నారని దుయ్యబట్టారు. పార్టీ ఇన్‌చార్జి గాదం వెంకట త్రినాథరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ డ్రామాలను ప్రజలకు ఇప్పటికే అర్థమయ్యాయని చెప్పారు. ఓ వైపు విద్యుత్ చార్జీలను పెంచేసి, మరోవైపు ఉచితంగా గ్యాస్ సిలిండర్లు ఇస్తామని ప్రగల్భాలు పలుకుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు రెల్ల సురేష్, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు కె.వి.ఎల్.ఎస్ ఈశ్వరి, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు తెంబూరు మధుసూదనరావు, నాయకులు ఆబోతుల వెంకట నాయుడు, బొత్స వెంకటరమణ, ఇజ్జురోతు రమణ, కొత్తకోట జోగి నాయుడు, మజ్జి మురళీమోహన్, దంత త్రినాధరా వు, అంబటి దాలినాయుడు, మామిడి సత్యన్నారాయణ, గొల్లపల్లి దాలయ్య, గుంటబారిక అప్పారా వు, పిసిని జనార్ధన, లోప్పింటి సీతయ్య, చిట్టిబారిక కృష్ణారావు, పాలవలస రమేష్‌కుమార్ పాల్గొన్నా రు. కాగా, విద్యుత్ కార్యాలయాల వద్ద సమ్మెలు, నిరసన కార్యక్రమాలను రద్దు చేస్తూ డిస్కం అధికారులు ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేయడంతో విద్యుత్ విజిలెన్స్ అధికారులు స్థానిక పోలీసులు సంయుక్తంగా ఈ నిరసన కార్యక్రమాలను అడ్డుకున్నారు.

ఆటోను ఢీకొట్టిన లారీ


నుజ్జయిన ఆటో

రణస్థలం : మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై రామతీర్థాలు కూడలి సమీపంలో విశాఖపట్నం వైపు నుంచి శ్రీకాకుళం వైపు వెళుతున్న లారీ ముందు వెళు తున్న ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో పల్టీలుకొట్టి నుజ్జునుజ్జయ్యింది. గురువారం ఉదయం 10 గంటల సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఆటోలో ఒక్క డ్రైవర్ మాత్రమే ఉండటం, అతనికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఆటోను ఢీకొట్టిన లారీ ఆగకుండా సుమారు 10 కిలోమీటర్లు వెళ్లడంతో పలువురు యువకులు వెంబడించి లావేరు మండలంలోని అదపాక వద్ద పట్టుకున్నారు. డ్రైవర్‌ను జె.ఆర్.పురం పోలీసులకు అప్పగించారు. ఈ ఆటో లావేరు మండలంలోని మురపాక గ్రామానికి చెందింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు సేకరిస్తున్నామని జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి తెలిపారు.

• డొనాల్డ్ ట్రంప్‌కు శుభాకాంక్షలు



అమెరికా అధ్యక్షుడిగా మరోసారి ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్‌కు సైకత యానిమేటరు మానస కుమార్ సాహు విభిన్నంగా శుభాకాంక్షలు తెలిపాడు. 1 నిమిషం 30 సెకన్ల నిడివితో శాండ్ యానిమేషన్ తయారు చేశాడు. దీని కోసం 3 గంటల పాటు శ్రమించాడు.

- భువనేశ్వర్

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు


టెక్కలిలో చికిత్స పొందుతున్న ఆనందరావు

టెక్కలి రూరల్: స్థానిక కచేరివీధి సాయిబాబా గుడి సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గోపినాథపురం గ్రామానికి చెందిన బెండి ఆనందరావు ద్విచక్రవాహనంపై టెక్కలి వైపు వస్తుండగా సాయిబాబాగుడి వద్దకు వచ్చే సరికి ఎదురుగా శాంభాన వీధికి చెందిన అశోక్‌వర్ధన్, నితిన్‌లు ద్విచక్రవాహనంపై ఎదురుగా వచ్చి ఢీకొన్నారు. ఈ ఘటనలో ఆనందరావు కుడికాలు విరిగిపోగా, అశోక్‌వర్ధన్, నితిన్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. ఆనందరావును మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులకు సమాచారం అందించారు.

మావోల బెడద తగ్గిస్తాం

మల్కన్‌గిరి:

జిల్లాలో గురువారం డీజీపీ యోగేష్ బహదూర్ ఖురానియా పర్యటించారు. ముందుగా ఆయన చిత్రకొండ స్వాభిమాన్ ఏరియాకు వెళ్లి అక్కడ బీఎస్‌ఎఫ్ క్యాంప్‌ను సందర్శించి జవాన్లతో మాట్లాడారు. అనంతరం మల్కన్‌గిరి జిల్లా పోలీసు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. జిల్లాలో మావోల అలజడి తగ్గిందని, 2026 నాటికి ఆ బెడద ఉండకుండా చేయడమే తమ లక్ష్యమని తెలిపారు. గిరిజనులకు అండగా నిలవాలని పోలీసులకు సూచించారు. ఏఓబీ సరిహద్దులో నిఘా పెంచాలన్నారు. జిల్లాలో గంజాయి సాగు వల్ల కలిగే అనర్థాలపై ప్రచారం చేయాలన్నారు. ఈ పర్యటనలో కొరాపుట్ డీఐజీలు అఖిలేశ్వర్ సింగ్, విశాల్ సింగ్, కొరాపుట్ ఎస్పీ రోహిత్ వర్మా, మల్కన్‌గిరి అదనపు ఎస్పీ తపన్ నారాయణ్ రోతో తదితరులు పాల్గొన్నారు.


చిత్రకొండ సమితి గురసేత్ బీఎస్‌ఎఫ్ క్యాంప్ వద్ద జవాన్లతో చర్చిస్తున్న డీజీ యోగేష్ బహదూర్ ఖురానీయా


బీఎస్‌ఎఫ్ క్యాంప్ వద్ద డీజీకి గౌరవవందనం ఇస్తున్న బీఎస్‌ఎఫ్ అధికారి


మల్కన్‌గిరిలో అధికారులతో చర్చిస్తున్న డీజీ యోగేష్ తదితరులు


గురసేత్ క్యాంప్‌ను పరిశీలిస్తున్న డీజీ ఇతర అధికారులు

క్లుప్తంగా

జేఎన్‌టీయూ జీవీని సందర్శించిన ఎస్పీ



ఎస్పీని సత్కరిస్తున్న యూనివర్సిటీ ఇంచార్జ్ విసి ప్రొఫెసర్ రాజ్యలక్ష్మి

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ జీవీ (గురజాడ విజయనగరం) లో 'సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్' అనే అంశంపై పోలీస్ శాఖ నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని ఎస్పీ వకుల్ జిందాల్ గురువారం సందర్శించారు. పర్యవేక్షణలో భాగంగా ఆయన యూనివర్సిటీ ప్రాంగణాన్ని పరిశీలించారు. తొలుత యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ వకుల్ జిందాల్‌ను యూనివర్సిటీలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్. జి. జె.నాగరాజు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఆర్‌డీడీవీ శివరాం, డాక్టర్. టీఎస్ఎన్ మూర్తి, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

సీతంపేట: గిరిజన నిరుద్యోగులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక వైటీసీలో గురువారం జరిగిన జాబ్‌మేళాకు ఆయన హాజరై అభ్యర్థులకు పలు సూచనలిచ్చారు. ఒక సారి ఉద్యోగంలో చేరాక మధ్యలో మానివేయకుండా కష్టపడి పనిచేయాలని హితవు పలికారు. హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో నడుస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్, బొల్లినేని మెడ్ స్కిల్స్ సహకారంతో ప్రొడక్షన్ మిషన్ ఆపరేటర్ కోర్సులో విశాఖపట్నంలో 3 నెలల శిక్షణ ఉంటుందన్నారు. మొత్తం 45 మంది అభ్యర్థులు జాబ్‌మేళాకు హాజరయ్యారు. కార్యక్రమంలో ఏపీఓ చిన్నబాబు, వెలుగు డీపీఎం ఆర్‌వీ రమణ పాల్గొన్నారు.

గోల్ట్‌మెడల్ సాధించిన గురుకుల విద్యార్థి



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థి రాఘవేంద్ర

బొబ్బిలిరూరల్: మండలంలోని కోమటిపల్లి గ్రామం వద్దనున్న మహాత్మ జ్యోతి బాపులే గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి వంగపండు రాఘవేంద్ర రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్ సాధించాడు. ఈనెల 6,7,8 తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా కైకలూరులో జరిగిన అథ్లెటిక్స్ అండర్-14 విభాగంలో 160 సెంటీమీటర్ల హైజంప్ చేసి గోల్డ్‌మెడల్ సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ జి. పురుషోత్తం గురువారం తెలిపారు. దీంతో జార్ఖండ్‌లో డిసెంబర్ 2 నుంచి జరగబోయే జాతీయ స్కూల్‌గేమ్స్ పోటీల్లో రాఘవేంద్ర పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థిని పాఠశాల పీడీ చొక్కాపు అప్పలనాయుడు, టీచర్స్, సిబ్బంది అభినందించారు. మరిన్ని పతకాలు సాధించాలంటూ ప్రోత్సహించారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు అక్కాచెల్లెళ్లు



జాతీయ తైక్వాండో పోటీలకు ఎంపికైన అక్కాచెల్లెళ్లు ధనుశ్రీ, దీక్ష శ్రీ

విజయనగరం: జిల్లాలోని డెంకాడ మండలం అక్కివరం గ్రామానికి చెందిన అక్కాచెల్లెళ్లు అట్టాడ ధనుశ్రీ, దీక్ష శ్రీలు తైక్వాండోలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారు. గత నెల 4,5 తేదీలలో ఆంధ్రప్రదేశ్ 68వ రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ అండర్ 19 పోటీలు కడపజిల్లా రైల్వేకోడూరు మండలం జరిగాయి. అక్కడ ఉత్తమ ప్రతిభ కనబరిచిన అట్టాడ ధనుశ్రీ జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. డిసెంబర్ 18 నుంచి 25 వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలో జరగనున్న జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఆమె హాజరు కానుంది. అలాగే దీక్షశ్రీ కూడా అక్క బాటలో నడుస్తూ ఉత్తమ ప్రతిభ కనబరుస్తోంది. గత నెల 6, 7 తేదీలలో తిరుపతిలో జరిగిన 68వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈనెల 8 నుంచి 12 వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని విదీశ జిల్లాలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో ఆమె పాల్గొంటుంది. ఈ సందర్భంగా జాతీయ పోటీలకు ఎంపికైన అక్కాచెల్లెళ్లకు పలువురు అభినందనలు తెలిపారు. జాతీయ స్థాయిలో కూడా ఉత్తమ ప్రతిభ కనబరచాలంటూ ప్రోత్సహించారు.

అపర సంజీవిని ఆపసోపాలు..!

- ప్రశ్నార్థకంగా 108 అంబులెన్సుల నిర్వహణ
- సిబ్బందికి 3నెలలుగా అందని జీతాలు
- నిర్వహణపై శ్రద్ధ చూపని కూటమి ప్రభుత్వం
- జిల్లాలో 108 అంబులెన్సులు 28
- 104 వాహనాలు 46



విజయనగరం ఫోర్ట్: జిల్లాలోని 108 అంబులెన్సులు రోగులకు సేవలందించేందుకు ప్రభుత్వం నిర్వాకంతో ఆపసోపాలు పడుతున్నాయి. అంబులెన్సుల నిర్వహణ ఈ ప్రభుత్వం హయాంలో ప్రశ్నార్థకంగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆపదలో ఉన్న ఎంతో మంది ప్రాణాలు కాపాడుతున్న 108 అంబులెన్సుల పట్ల కూటమి సర్కార్ నిర్దయతో వ్యవహరిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. 108 అంబెలెన్సుల నిర్వహణకు అవసరమైన నిధులు ప్రభుత్వం విడుదల చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తోంది. దీంతో 108 అంబులెన్సులకు డీజిల్ వేయించడానికి నిర్వహణ సంస్థ ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తోంది. 108 నిర్వహణకు నిధులు ఇవ్వకపోవడం వల్ల సిబ్బందికి జీతాలు కూడా సక్రమంగా అందని పరిస్థితి. గడిచిన మూడు నెలలుగా వారికి జీతాలు అందకపోవడం వల్ల కొద్ది రోజులుగా సిబ్బంది నల్లబాడ్జీలతో నిరసన తెలియజేస్తున్నారు. 108 అంబులెన్సుల సిబ్బందితో పాటు, 104 సిబ్బంది, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సిబ్బందికి కూడా జీతాలు అందని పరిస్థితి. వీటి నిర్వహణ కూడా ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది.

108 ద్వారా ఎంతో మందికి సేవలు

ఆపద సమయంలో ప్రాణాలు నిలిపే ప్రాణదాతగా108 అంబులెన్సుకు గుర్తింపు. రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులు, పురిటినొప్పులు వచ్చే సమయంలో ప్రసవం కోసం ఆస్పత్రికి వెళ్లే గర్భిణులు, ఊపిరాడక ఇబ్బంది పడే రోగులు, పాము కాటుకు గురైన వారు, గుండె పోటు, పక్షవాతం, తీవ్రమైన కడుపు నొప్పి ఇలా అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారిని సకాలంలో 108 అంబులెన్సులు ఆస్పత్రికి చేర్చుతున్నాయి.

2020 నుంచి 2023 వరకు అందించినసేవలు వివరాలు:

సంవత్సరం	సేవలు పొందిన రోగులు
2020	24,868
2021	56,536
2022	55,556
2023	80,500

జిల్లాలో 28 వాహనాలు

జిల్లాలో 108 అంబులెన్సులు 28 ఉన్నాయి. వాటిలో రెండు అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్టు వాహనాలు. ఒకటి నవజాత శిశువులకు సేవలు అందించే నియోనేటల్ అంబులెన్సు. 25 లైఫ్ సపోర్టు అంబులెన్సులు. ఉన్నాయి. వాటికి ప్రతిరోజూ డీజిల్‌కు రూ.2 లక్షల వరకు ఖర్చవుతుంది. అదేవిధంగా జిల్లాలో 104 వాహనాలు 46 ఉన్నాయి. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు 22 ఉన్నాయి. వాటికి డీజిల్ నిమత్తం రోజుకు రూ.లక్ష వరకు ఖర్చవుతుంది.

గత ప్రభుత్వంలో 2.17 లక్షల మందికి సేవలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో జిల్లాలో 2020లో ఆధునాతన 108అంబులెన్సులు ప్రారంభించారు. 2020 నుంచి 2023 వరకు 2,17,460 మందికి ఈ అంబులెన్సులు సేవలు అందించాయి. ఏడాదికి 50 వేల నుంచి 80 వేల మంది వరకు సేవలు పొందారు.

డీజిల్‌కు ఇబ్బంది పడుతున్న పరిస్థితి

108 అంబులెన్సులకు డీజిల్‌కు డబ్బులు లేక పోవడంతో ఇబ్బంది పడుతున్నారు. బంక్ యాజమానులతో మాట్లాడి అంబులెన్సులకు బడ్జెట్ వచ్చినప్పడు చెల్లిస్తామని డీజిల్ వేయిస్తున్నారు. 108 అంబులెన్సులలో 142 మంది, 104 వాహనాలల్లో 103 మంది పైలెట్లు, ఈఎంటీలు,డేటా ఎంటీ ఆపరేటర్లు, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్స్, జిల్లా మేనేజర్లు పనిచేస్తున్నారు.

జీతాలు అందడం లేదు

108 అంబులెన్సు, 104 సిబ్బందికి మూడు నెలలుగా జీతాలు అందని మాట వాస్తవమే. బడ్జెట్ వస్తే డీజిల్ డబ్బులు ఇస్తామని బంక్ యాజమానులకు చెప్పి అంబులెన్సులకు డీజిల్ పోయిస్తున్నాం.

నజీర్ హుస్సేన్, 108,104 జోనల్ మేనేజర్

ఏనుగుల విడిది కేంద్రం ఏర్పాటు

- జిల్లా అటవీ శాఖాధికారి జీఏపీ ప్రసూన



జిల్లా అటవీ శాఖాధికారి జీఏపీ ప్రసూన

పార్వతీపురంటౌన్: జిల్లాలో ఏనుగుల విడిది కేంద్రం ఏర్పాటుకు ఇప్పటికే ప్రతిపాదనలు పంపామని పార్వతీపురం మన్యం జిల్లా అటవీ శాఖాధికారి జీఏపీ ప్రసూన వెల్లడించారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. పంటనష్టం, మానవ ప్రాణనష్టం, గాయాలు, పశువుల మరణాల అవకాశాలను తగ్గించడం ద్వారా నిర్దిష్ట ప్రాంతంలో ఏనుగులను నిలువరించడం ఈ కేంద్రం లక్ష్యమని ఆమె తెలిపారు. 2018 నుంచి ఇప్పటివరకు ఏనుగుల దాడుల వల్ల దాదాపు రూ.13 కోట్లు పంటనష్టం జిల్లాలో జరిగినట్లు అంచనా వేశామని పేర్కొన్నారు. ఆహారం, నీరు, నివాసం కోసం ప్రయాణించే ఏనుగుల కదలికలను అంచనా వేయడం కష్టతరమన్నారు. మానవులు, వన్య ప్రాణుల మధ్య ఘర్షణలను తగ్గించేందుకు అటవీ శాఖ చురుగ్గా పని చేస్తోందని, పెదబొండపల్లి గ్రామంలో ఇటీవల జరిగిన అవాంఛనీయ సంఘటన దృష్ట్యా, ప్రస్తుతం ఏనుగులు ఉన్నచోట పెద్ద సంఖ్యలో జనం గుమిగూడినందున ఆ ప్రాంతంలో 144 సెక్షన్ విధించాలని తెలియజేశామన్నారు. అటవీ శాఖ ఏనుగుల కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తుందని, ఎలిఫెంట్ ట్రాకర్లను నియమించామని, వాటి భద్రతను నిర్ధారించడానికి స్థానిక గ్రామస్తులను వెంటనే అప్రమత్తం చేస్తున్నట్లు వివరించారు. ఏనుగుల కార్యకలాపాల కారణంగా పంటలు దెబ్బతిన్నప్పుడు, బాధిత రైతుల నుంచి దరఖాస్తులను సేకరించి, అవసరమైన పరిహారం క్లెయిమ్‌లు అందేలా చూసేందుకు అటవీ శాఖ పూర్తి బాధ్యత తీసుకుంటుందని స్పష్టం చేశారు.



వెంకంపేట నుంచి వెళ్తున్న ఏనుగులు

ఏనుగులను తరలించేందుకు స్పెషల్ డ్రైవ్

జనావాసాల నుంచి ఏనుగులను తరలించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు జిల్లా అటవీ శాఖ అధికారి ప్రసూన తెలిపారు. ఈ మేరకు పార్వతీపురం మండలంలోని వెంకంపేట నుంచి గురువారం ఈ డ్రైవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏనుగుల వల్ల జరిగే ఆస్తి, ప్రాణనష్టాలను నివారించేందుకు తరలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ట్రాకర్లు అటవీ శాఖ సిబ్బందితో కలిసి ఏనుగులను తరలిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం ఏనుగులను అడ్డూరు వలస గ్రామం వరకు తరలించామన్నారు.

వ్యాన్ బోల్తా



జాతీయ రహదారిపై బోల్తా పడిన వ్యాన్

భోగాపురం: మండల కేంద్రం భోగాపురం జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం ఓ వ్యాన్ బోల్తా పడింది. చేపలలోడుతో విశాఖపట్నం నుంచి ఒడిశా వెళ్తుండగా వ్యాన్ డ్రైవర్ బాపీ సడన్ బ్రేక్ వేయడంతో ముందు టైర్ పంక్చర్ అయి బోల్తా పడడంతో జరిగిన ప్రమాదంలో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయ ట పడ్డాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న నేషనల్ హైవే సిబ్బంది, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా బోల్తా పడిన వ్యాన్‌ను జేసీబీ సాయంతో పక్కకు తొలగించారు.

యువత సామర్థ్యాన్ని నిర్వీర్యం చేయవద్దు

- డీవైఎఫ్ఐ విజ్ఞప్తి

విజయనగరం ఫూల్‌బాగ్: కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఖాళీగా ఉన్న ఉద్యోగాల్లో పదవీ విరమణ చేసిన సిబ్బందిని మళ్లీ నియమించాలని భారతీయ రైల్వే ఇటీవల తీసుకున్న నిర్ణయాన్ని, డెమొక్రటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విజయనగరం రైల్వే స్టేషన్‌మాస్టర్. మాస్టర్ మురళికి డీవైఎఫ్ఐ జిల్లా కన్వినింగ్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కన్వీనర్ సీహెచ్. హరీష్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ ఈ విధానం యువత సామర్థ్యాన్ని బలహీనపరిచే విధంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే దేశంలో ఇప్పటికే నిరుద్యోగం తారాస్థాయిలో పెరుగుతున్న తరుణంలో రైల్వే శాఖలో 2.98 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉండగా, అర్హత కలిగిన నిరుద్యోగులను పక్కన పెట్టి కాంట్రాక్ట్ ప్రాతిపదికన రిటైర్డ్ ఎంప్లాయిస్‌ను తీసుకోవడం దుర్మార్గమని దుయ్యబట్టారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్న ప్రధాని మోడీ అందుకు భిన్నంగా యువత భవిష్యత్తును నిర్వీర్యం చేసే విధంగా వ్యవహరించడం దుర్మార్గమంటూ ఖండించారు. దేశవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 9.8 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయకుండా నిర్లక్ష్యంగా కేంద్రం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ సభ్యులు దుర్గాప్రసాద్, కిరణ్ పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

విద్యార్థి తండ్రికి చెక్కు అందజేత

పార్వతీపురం: జియ్యమ్మవలస మండలంలోని రావాడ-రామభద్రపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థి నిమ్మక సంజీవరావు బుధవారం మృతిచెందిన నేపథ్యంలో మృతుని తండ్రి కృష్ణారావుకు తక్షణ ఆర్థిక సాయంగా లక్షరూపాయల చెక్కును ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ గురువారం అందజేశారు. ఆరోగ్యంగా ఉన్న సంజీవ్‌కుమార్ 7వ తరగతి చదువుతున్నాడు. ఆధార్‌కార్డు, రేషన్ కార్డు కావాలని పాఠశాల సిబ్బంది ఫోన్ చేయగా తండ్రి కృష్ణారావు తీసుకు వెళ్తుండగా కురుపాం వెళ్లేసరికి కుమారుడు సంజీవ్‌కుమార్ ఆరోగ్యం బాగులేదని సమాచారం వచ్చింది. అరువాత ఆశ్రమ పాఠశాల సిబ్బంది తమ కుమారుడి మృతదేహాన్ని ఆటోలో మా గ్రామానికి పంపించారని, ఆరోగ్యంగా ఉన్న కుమారుడు ఒక్కసారిగా ఎలా చనిపోయాడో అర్థం కావడం లేదని, దీనిపై దర్యాప్తు నిర్వహించి ఆదుకోవాలని మృతుడి తండ్రి కోరాడు. కృష్ణారావు భార్య రెండేళ్ల క్రితమే భార్య చనిపోయింది. ఉన్న ఒక్కగానొక్క కుమారుడు కూడా చనిపోయాడు. ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు.



చెక్కును అందజేస్తున్న ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ

జాతీయ స్థాయి పోటీలకు కొత్తగూడ విద్యార్థులు

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం మండలంలోని కొత్తగూడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ఆరిక అభిచందు, ఆరిక చరణ్‌లు జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ నిమ్మక మాధవరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఆరిక అభిచందు రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్ 14 ఫెన్సింగ్ గేమ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికయ్యాడని, ఈనెల 12 నుంచి 16వ తేదీ వరకు జమ్ముకశ్మీర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. అలాగే 8వ తరగతి చదువుతున్న ఆరిక చరణ్ ఇటీవల తెనాలిలో జరిగిన అండర్ 14 విభాగం హ్యాండ్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపర్చి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని, ఈ విద్యార్థి ఈనెల 24 నుంచి ఛత్తీస్‌గఢ్‌లో జరగనున్న జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఈమేరకు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన ఇద్దరు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచాలని పీడీ మాధవరావుతో పాటు హెచ్‌ఎం నాగేశ్వరరావు, డిప్యూటీ వార్డెన్ ఆర్.రమేష్ తదితరులు ఆకాంక్షించారు.



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పీడీ మాధవరావు

జీసీసీ గొడౌన్‌లో అగ్నిప్రమాదం

- బూడిదైన నరమామిడి చెక్కల బస్తాలు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలం మొండెంఖల్లు గ్రామంలోని జీసీసీ అటవీఫలసాయాల కొనుగోలు కేంద్రం (ఎంఎఫ్‌పీ)లో గురువారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో గొడౌన్‌లో నిల్వ ఉంచిన నరమామిడి చెక్కల బస్తాలు దగ్ధమయ్యాయి. గొడౌన్ లోపలి నుంచి పొగలు రావడాన్ని గమనించిన స్థానికులు తలుపులు తెరిపించి చూసేలోగా నరమామిడి చెక్కల బస్తాలు అగ్నికి ఆహుతుండడం గమనించి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అలాగే గుమ్మలక్ష్మీపురం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పారు. అయినప్పటికీ కొంతమేర బస్తాలు కాలిపోయాయి. ఈ సమాచారం తెలుసుకున్న పార్వతీపురం జీసీసీ డివిజనల్ మేనేజర్ వి.మహేంద్రకుమార్ హుటాహుటిన మొండెంఖల్లు చేరుకుని గొడౌన్‌ను పరిశీలించి, జరిగిన నష్టం, అగ్ని ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. గొడౌన్ వద్ద 2,400 నరమామిడి చెక్కల బస్తాలు నిల్వ ఉండేవని, జరిగిన అగ్నిప్రమాదంలో సుమారు రూ.15 లక్షలు విలువ చేసే నరమామిడి చెక్కలు కాలిబూడిదయ్యాయని డీఎం తెలిపారు. అగ్ని ప్రమాదం జరగడానికి గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు. ఆయన వెంట గుమ్మలక్ష్మీపురం జీసీఎంఎస్ మేనేజర్ కృష్ణప్రసాదరావు, ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్ సూపరింటెండెంట్ ఎం.సాంబశివరావు తదితరులు ఉన్నారు.



మొండెంఖల్లు గొడౌన్‌లో కాలిపోతున్న నరమామిడి చెక్కల బస్తాలు

స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు విస్తరించాలి

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్
- ఘనంగా 75వ ఆవిర్భావ దినోత్సవం

విజయనగరం అర్బన్: గొప్ప సేవా దృక్పథంతో, జాతికి విశేష సేవలను అందిస్తున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలను మరింత విస్తరించాలని కలెక్టర్, స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా చైర్మన్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పిలుపునిచ్చారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ 75 ఆవిర్భావ దినోత్సవాన్ని కలెక్టరేట్ ఆడిటోరియంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై, విశేష ప్రతిభ చూపిన 10 మంది స్కౌట్స్, గైడ్స్‌కు రాజ్యపురస్కార్ సర్టిఫికెట్లను బహూకరించి, వారిని అభినందించారు. స్కౌట్స్ ప్రదర్శించిన విన్యాసాన్ని తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్కౌట్స్, గైడ్స్ సేవలను ప్రశంసించారు. సేవా దృక్పథంతో ముందుకు వెళ్తున్న ఈ సంస్థకు అత్యంత ప్రాముఖ్యం ఉందన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 8, 9, 10 తరగతి విద్యార్థులను ఈ ఉద్యమంలోకి తీసుకురావాలని సూచించారు. దశలవారీగా ప్రైవేట్ పాఠశాలలకు కూడా విస్తరిస్తామని ప్రకటించారు. జిల్లాలో స్కౌట్స్, గైడ్స్ సేవలను విస్తరించేందుకు జిల్లా యంత్రాంగం తరఫున సంపూర్ణ సహకారం అందిస్తామని కలెక్టర్ చెప్పారు.

ప్రతి పౌరుడిపై దేశ బాధ్యత

జిల్లా విద్యాశాఖాధికారి, స్కౌట్స్ అండ్ గైడ్స్ ఛీఫ్ కమిషనర్ మాణిక్యం నాయుడు మాట్లాడుతూ విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే దేశభక్తిని పెంపొందించేందుకు స్కౌట్స్ అండ్ గైడ్స్ దోహదపడుతుందన్నారు. మాతృభూమిని సంరక్షించడంతోపాటు, గౌరవించాల్సిన బాధ్యత దేశంలోని ప్రతి పౌరునిపైనా ఉందని అభిప్రాయ పడ్డారు. ఈ బాధ్యతను స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రేరేపిస్తుందని చెప్పారు. మంచి పౌరులను తీర్చిదిద్దడానికి ఉపయోగపడే ఈ కార్యక్రమం మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి వి.చిన్నంనాయుడు మాట్లాడుతూ ఈ ఉద్యమ చరిత్రను వివరించారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యకలాపాలు జిల్లాలో బాగా జరుగుతున్నాయని, కొత్తవలస జెడ్పీ ఉన్నతపాఠశాల విద్యార్థి ఆర్‌డీ సోమేశ్వరరావు రాజ్యపురస్కార్‌కు ఎంపికై, గవర్నర్ చేతులమీదుగా అందుకున్నాడని తెలిపారు. కార్యక్రమంలో డీసీ బోర్డు కార్యదర్శి సన్యాశిరాజు, జిల్లా స్కౌట్స్ కమిషనర్ ఈపు విజయకుమార్, గైడ్స్ కమిషనర్ సౌభాగ్యలక్ష్మి, ఇతర ప్రతినిధులు, హెడ్‌మాస్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లాలో రాజ్య పురస్కార్ సర్టిఫికెట్ పొందిన విద్యార్థులు

వి.రాధాకృష్ణ (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, లక్కిడాం), పల్లి గుణవర్ధన్ (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జొన్నవలస), వీవీ జ్ఞానేశ్వర్ (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జొన్నవలస), కోట్ల వాసుదేవ్ (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రెల్లివలస), నంద బెనర్జీ బాబు (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కొత్తవలస), రెడ్డి మిధున్ చక్రవర్తి (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మొయిద), అవినాష్ (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎల్ కోట), బండి ఇమ్మానుయేల్ (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గంగుపూడి), నేతల జాన్ బెర్నాళ్డ్ (సెయింట్ మేరీస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, విజయనగరం), పాతర్లపల్లి చరణ్ (శ్రీ ఆదిత్య పబ్లిక్ స్కూల్, నెల్లిమర్ల).



ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రారంభించిన కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్



రాజ్య పురస్కార్ సర్టిఫికెట్లను అందజేస్తున్న కలెక్టర్ అంబేడ్కర్



గవర్నర్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్న సోమేశ్వరరావు (కుడివైపు చివరన కళ్లద్దాలు పెట్టుకున్న విద్యార్థి)

పట్టు బిగిస్తున్న ఉత్తరాఖండ్

- మొదటి ఇన్నింగ్స్‌లో 338 పరుగులు
- ఆంధ్ర 92/4



ఆంధ్రా-ఉత్తరాఖండ్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్




బౌలింగ్ చేస్తున్న ఆంధ్రా ఆటగాడు

విజయనగరం: జిల్లా వేదికగా జరుగుతున్న ఆంధ్రప్రదేశ్- ఉత్తరాఖండ్ జట్ల మధ్య రంజీ క్రికెట్ మ్యాచ్‌లో ఉత్తరాఖండ్ జట్టు పట్టు బిగిస్తోంది. డెంకాడ మండలంలోని చింతలవలసలో గల డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో రెండు రోజులుగా జరుగుతున్న మ్యాచ్‌లో బ్యాటింగ్, బౌలింగ్‌లో ఉత్తరాఖండ్ క్రీడాకారులు రాణిస్తున్నారు. 87 ఓవర్లలో వికెట్‌నష్టపోయి 223 పరుగులు ఓవర్‌నైట్ స్కోరు వద్ద రెండవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన ఉత్తరాఖండ్ జట్టు ఎక్కువ సమయం మైదానంలో నిలదొక్కుకోలేకపోయింది. మొత్తం 135.2ఓవర్లలో 338 పరుగులకు ఆలౌటైంది. జట్టులో పీఎస్ కుందూరి 112 పరుగులు, సమర్థ్ 59 పరుగులతో రాణించారు. బౌలింగ్‌లో ఆంధ్ర క్రీడాకారులు లలిత్‌మోహన్ 4 వికెట్లు, కేవీ.శశికాంత్ 2 వికెట్లు, పీవీఎస్ఎన్ రాజు2 వికెట్లు, త్రిపురణ విజయ్ 2 వికెట్లు దక్కించుకున్నారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ బ్యాటింగ్ ప్రారంభించిన ఆంధ్రా జట్టు బ్యాట్స్‌మెన్ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారు. రెండవ రోజు ఆట ముగిసే సమయానికి 35.4ఓవర్లలో 4 వికెట్లు నష్టపోయి 92 పరుగులు చేశారు. జట్టు బ్యాటింగ్‌లో అభిషేక్‌రెడ్డి 35 పరుగులు, హేమంత్‌రెడ్డి 18 పరుగులు, కరణ్ షిండే 19 పరుగులు, విహారి 15 పరుగులు (నాటౌట్‌గా) పరుగులు జోడించారు. టెస్ట్ మ్యాచ్ తరహాలో 4 రోజుల పాటు జరిగే మ్యాచ్‌లో మరో రెండు రోజుల ఆట మిగిలి ఉంది.

సినీ ఫక్కీలో చోరీ

- నాలుగున్నర తులాల బంగారు ఆభరణాలతో పరారీ

గరుగుబిల్లి: ఓ వృద్ధురాలిని బైక్‌పై ఎక్కించుకుని సినీఫక్కీలో చోరీకి పాల్పడిన సంఘటన గురువారం గరుగుబిల్లి మండలంలోని దళాయివలసలో జరిగింది. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గంట గంగమ్మ పార్వతీపురం వెళ్లేందుకు గ్రామంలోని ఆంజనేయస్వామి విగ్రహం వద్ద వేచి ఉన్న సమయంలో అటుగా పల్సర్ బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తి ఎర్రన్న గుడి వరకు దింపుతానని చెప్పి వృద్ధురాలిని బైక్‌పై ఎక్కించుకున్నాడు. ఉల్లిభద్రకు వెళ్లే ముందు ఉన్న మట్టి రోడ్డు వైపు బైక్ తిప్పడంతో ఇటు ఎందుకు వెళ్తున్నావని గంగమ్మ ప్రశ్నించగా ఏమీ చెప్పకుండా బైక్‌ను నడిపాడు. దీంతో వెనుకన కూర్చున్న గంగమ్మకు ఏం చేయాలో తోచక బైక్‌పై నుంచి దూకేయడంతో కింద పడి స్పృహ కోల్పోవడంతో ఆమె మెడలో ఉన్న రెండు తులాల గొలుసు, రెండుపేట్ల పుస్తుల తాడు తీసుకుని ఆ నిందితుడు పరారయ్యాడు. స్పృహ వచ్చిన తరువాత గంగమ్మ ఈ విషయాన్ని బంధువులకు తెలియజేసింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు, బంధువులు ఆమెను చికిత్స కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై టి.రమేష్ నాయుడు తెలిపారు.



చికిత్స పొందుతున్న గంగమ్మ

గిరిజన విద్యార్థుల వరుస మరణాలు బాధాకరం

- ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు



పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థుల మృతిపట్ల రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల మృతికి గల కారణాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని మన్యం జిల్లా కలెక్టర్‌ను కోరారు. జియ్యమ్మవలస మండలం రావాడ రామభద్రపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థితో పాటు, కురుపాం గిరిజన సంక్షేమ పాఠశాల విద్యార్థి అనారోగ్యంతో మృతి చెందిన సమాచారం తెలుసుకున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ ఆశ్రమ పాఠశాల నిర్వహణ, నెలకొన్న పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్కరోజు వ్యవధిలోనే ఇద్దరు విద్యార్థులు మృతి చెందిన పరిస్థితులపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు. ఆశ్రమ పాఠశాలల్లో పరిశుభ్రమైన తాగునీరు, మౌలిక సదుపాయాలతో పాటు దోమతెరలు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో గిరిజన సంక్షేమ పాఠశాలలు, వసతి గృహాలలో ఎటువంటి చర్యలు చేపట్టారో సమగ్ర నివేదికలను అందజేయాలని పార్వతీపురం మన్యం జిల్లాతో పాటు విజయనగరం, అల్లూరి సీతారామరాజు, శ్రీకాకు ళం జిల్లాల కలెక్టర్లను కోరారు. ఆయా జిల్లాల్లో గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల నిర్వహణ, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై కలెక్టర్లు దృష్టి సారించాలని సూచించారు.